వస్తున్నాం తల్లీ.. బయలెల్లి

కొండపోచమ్మకు ముక్కోటి దండాలు.. కరుణించి కాపాడే తల్లి పోచమ్మకు శతకోటి దండాలు.. అంటూ భక్తులు అమ్మవారిని దర్శించుకోనున్నారు. ఆలయం ఉత్సవాలకు ముస్తాబైంది. మూడు నెలల పాటు అంగరంగ వైభవంగా జరగనున్న జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు నిర్వాహకులు.

- ముస్తాబైన కొండ పోచమ్మ ఆలయం
- నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం
- ఉగాది వరకు జాతర వైభవం



కొండ పోచమ్మ దేవాలయం

జగదేవ్‌పూర్: కొండపోచమ్మ దేవస్థానం మెదక్ జిల్లా జగదేవ్‌పూర్ మండల పరిధిలోని తీగుల్ నర్సాపూర్ గ్రామానికి ఉత్తర దిశలో ఉంది. కొండపోచమ్మ నామంతో ప్రసిద్ధి పొందిన జగన్మాతశీలాదేవి వేలాది మంది భక్తులకు ఆరాధ్యదైవమై నిత్యపూజలందుకుంటోంది. ఈ ఉత్సవాలు ఆదివారం ప్రారంభమై ఉగాది వరకూ జరుగుతాయి. జాతరకు హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

సర్వం సిద్ధం

ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఆలయ కార్యనిర్వహణ అధికారి రవికుమార్ తెలిపారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్, జనగామ బస్సుడిపోల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఆది, సోమ, మంగళవారాలలో ఈ ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఆరోజులలో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. దీంతో ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చర్యలు చేపడుతున్నట్లు ఎస్ చంద్రమోహన్ తెలిపారు.



ఆలయ ఈఓ రవికుమార్

ఆకర్షించే లష్కర్ బోనాలు

జాతరలో పాల్గొనే భక్తులు ఆలయం ఎదుటనున్న చెరువులో స్నానాలాచరించి అమ్మవారిని దర్శించుకుంటూరు. అమ్మవారి నైవేద్యానికి వండిన బోనాన్ని పసుపు, కుంకుమలతో అలంకరించి డప్పులతో ఆడుతూపాడుతూ అమ్మవారి సన్నిధికి తీసుకువస్తారు. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి వచ్చే భక్తులుతీసే బోనాలు జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. కోరికలు తీర్చాలని అమ్మవారి గుడి వద్ద ఉన్న చెట్టుకు భక్తులు ముడుపులు కడుతుంటారు. కోరికలు తీరగానే ముడుపులు అమ్మవారికి చెల్లిస్తారు. సంతానం కావాలని కోరికునే వారు తొట్లెలను ముడుపుగా కడతారు.



కొలువైన అమ్మవారు

హామీలన్నీ నెరవేర్చాకే ఓట్లడుగుతాం

మంత్రి కొండా సురేఖ

సిద్దిపేటఅర్బన్: రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని, ఇచ్చిన హామీలను నెరవేర్చాకే రానున్న ఎన్నికల్లో ఓట్లడుగుతామని మంత్రి కొండా సురేఖ అన్నారు. మండలంలోని ఎన్సాన్‌పల్లిలో శనివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ మండలంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.60లక్షలు, పంచాయతీ భవనాల నిర్మాణానికి రూ.40లక్షలు, అంగన్వాడీ భవన నిర్మాణానికి రూ.8లక్షలు, టాయిలెట్స్‌కు రూ.2లక్షలు మంజూరు చేయించామన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ, మండల అధ్యక్షుడు భిక్షపతి, గ్రామశాఖ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పార్కు, ఎఫ్ఎస్‌టీపీ కేంద్రాల ప్రారంభం

దుబ్బాక: ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వనితతో కలిసి చిన్నారుల పార్కు, ఎఫ్ఎస్‌టీపీ కేంద్రాలను సురేఖ ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

తొగుట(దుబ్బాక): కొమురవెల్లి మల్లన్నసాగర్ నుంచి దుబ్బాక, సిద్దిపేట, సిరిసిల్ల నియోజకవర్గాలకు సాగునీటిని మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మల్లన్నసాగర్‌లో ప్రస్తుతం 18టీఎంసీల నీటి నిల్వ ఉండగా 500ల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు.

విద్యా వ్యవస్థకే పెద్దపీట

దౌల్తాబాద్(దుబ్బాక): విద్యార్థుల చదువుకే రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి కొండా సురేఖ అన్నారు. మండల కేంద్రంలో రూ.1.54 కోట్ల నిధులతో నిర్మించిన మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌ను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ మను చౌదరి, డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, దౌల్తాబాద్ మండల అధ్యక్షుడు రాములు, ఉపాధ్యక్షుడు మద్దెల స్వామి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు లాలు, గణేశ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సురేఖ

రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించండి

దుబ్బాకటౌన్: దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని దుబ్బాక డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు మాడబోయిన శ్రీకాంత్, అసంపూర్తిగా ఉన్న చేనేత సొసైటీ భవనానికి నిధులు మంజూరు చేయాలని చేనేత ఐక్యవేదిక నేత భాస్కర్ ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేశారు.

అప్పుల్లోకి నెట్టారు..

నంగునూరు(సిద్దిపేట): ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి మంత్రి సురేఖ భూమిపూజ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి రూ.5లక్షలు కేటాయించారని చెప్పారు. గత పాలకులు రాష్ట్ర ఖజానాను ఖాళీ చేయడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు.

బ్యాంకులు, ఏటీఎంల వద్ద అప్రమత్తం

ఏసీపీ పురుషోత్తంరెడ్డి



మాట్లాడుతున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

గజ్వేల్‌రూరల్: బ్యాంకులు, ఏటీఎంల వద్ద సెక్యూరిటీని అప్రమత్తంగా ఉంచాలని ఏసీపీ పురుషోత్తంరెడ్డి బ్యాంకు మేనేజర్లకు సూచించారు. శనివారం ప్రజ్ఞాపూర్‌లోని ఏసీపీ కార్యాలయంలో బ్యాంకు మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులు, ఏటీఎంల వద్ద సీసీ కెమెరాలు, సెక్యూరిటీ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనబడితే వెంటనే 100కు సమాచారం అందించాలని, అలారం సిస్టం పనిచేసేలా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గజ్వేల్ సీఐ సైదా, తొగుట సీఐ లతీఫ్, ఎస్ఐ రవికాంతరావు, కుకునూర్‌పల్లి ఎస్ఐ శ్రీనివాస్, ఆయా బ్యాంకుల మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

పోలీసులా.. కాంగ్రెస్ కార్యకర్తలా

ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి



ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా ప్రవర్తిస్తూ బీఆర్ఎస్ నాయకులపై కర్కశంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో మంత్రి కొండా సురేఖ పర్యటనలో పూర్తిగా ప్రొటోకాల్ ఉల్లంఘన జరిగిందని, కలెక్టర్, అధికారులు ప్రేక్షకపాత్ర వహించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. సీఐ బీఆర్ఎస్ కార్యకర్తలపై చేయి చేసుకోవడంపై మండిపడ్డారు. పాత పనులకు ప్రారంభోత్సవాలు తప్ప కొత్తగా చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు.

డంపింగ్ యార్డులో మరోసారి మంటలు



గజ్వేల్‌లోని డంపింగ్ యార్డులో చెలరేగుతున్న మంటలు

- టన్నులకొద్దీ చెత్త దగ్ధం
- వరుస ఘటనలపై విమర్శలు

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డులో శనివారం మరో అగ్ని ప్రమాదం చోటుచేసుకొంది. మధ్యాహ్నం స్వల్పంగా మొదలైన మంటలు క్రమంగా పెరిగిపోయాయి. చెత్తలో దీపావళి సందర్భంగా జనం కాల్చిపడేసిన బాణాసంచా ఉండటంతో మంటలు మరింత ఉధృతమయ్యాయి. దీంతో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య డంపింగ్ యార్డు వద్దకు చేరుకొని ఫైరింజన్ రప్పించారు. మున్సిపాలిటీకి చెందిన వాటర్ ట్యాంకర్లను సైతం తెప్పించి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. రాత్రి వరకు మంటలు కొనసాగాయి. అయినా టన్నుల కొద్దీ చెత్త కాలిబూడిదైంది. తడి, పొడిచెత్తను సక్రమ పద్ధతిలో వేరు చేయకపోవడం వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగి ఉండొచ్చని భావిస్తున్నారు. గతయేడాది జూన్‌లో ఇదే తరహాలో అగ్నిప్రమాదం చోటుచేసుకొంది. తరుచూ ఇలా మంటలు చెలరేగడం, నివారణలో మున్సిపల్ అధికారులు విఫలమవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తప్పిపోయిన పాప తల్లి చెంతకు



తల్లి వద్దకు చేరిన చిన్నారి

గజ్వేల్‌రూరల్: తప్పిపోయిన ఓ పాపను గంటల వ్యవధిలోనే పోలీసులు తల్లి చెంతకు చేర్చారు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి గజ్వేల్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఐఓసీ వెనుక ఉన్న ఓ గుడిసెలో మోతె మైసమ్మ–యాదగిరి దంపతులు నివాసముంటున్నారు. వారి మూడేళ్ల కూతురు పున్నమ్మ తప్పిపోయిందని రాత్రి 10గంటలకు వారు ఫిర్యాదు చేశారు. సీఐ సైదా తమ సిబ్బంది వెంకటేశ్, నరేందర్, కృష్ణ, రాజును బృందాలుగా ఏర్పాటుచేసి గాలింపు చేపట్టారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ద్వారా చిన్నారిని గుర్తించి 12గంటల సమయంలో తల్లిదండ్రులను పిలిపించి వారికి అప్పగించారు. పోలీస్ కమిషనర్ అనురాధ, ఏసీపీ పురుషోత్తంరెడ్డి సీఐ సైదా, సిబ్బందిని అభినందించారు.

భక్తులకు ఇబ్బందులు కలిగించొద్దు

ఆర్డీఓ చంద్రకళ

జగదేవ్‌పూర్(గజ్వేల్): కొండపోచమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ చంద్రకళ ఆదేశించారు. ఆర్డీఓ కార్యాలయంలో మండలానికి చెందిన వివిధ శాఖల అధికారులు, ఆలయ ఈఓ, ఎస్ఐ చంద్రమోహన్‌లతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివారం నుంచి ప్రారంభమయ్యే కొండపోచమ్మ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారన్నారు. పార్కింగ్ సమస్య, తాగునీటి కొరత లేకుండా చూడాలని, అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. వైద్యశాఖ అధికారులు శిబిరంతోపాటు 108 వాహనాన్ని సిద్ధంగా ఉంచాలని, పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాదగిరి, ఈఓ రవికుమార్, తహసీల్దార్ కృష్ణమోహన్, ఎస్ఐ చంద్రమోహన్, వివిధ శాఖల అధికారులు రాకేశ్, లత, శివశంకర్, కార్యదర్శి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రకళ

ఒకే కొనుగోలు కేంద్రం.. ఇద్దరితో ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా

కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల పోటాపోటీ

చేర్యాల(సిద్దిపేట): ఒకే కొనుగోలు కేంద్రాన్ని ఒకేరోజు వేర్వేరుగా ఇద్దరు నేతలు ప్రారంభించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఉదయం పీఏసీఎస్ చైర్మన్ మేర్గు కృష్ణాగౌడ్, మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తమ పార్టీ డైరెక్టర్లు, నాయకులతో కలిసి ప్రారంభించి వెళ్లిపోయారు. తర్వాత కొద్ది సమయానికి వచ్చిన ఎమ్మెల్యే డా.పల్లా రాజేశ్వర్‌రెడ్డి తమ పార్టీ డైరెక్టర్లు నాయకులతో కలిసి తిరిగి కేంద్రాన్ని ప్రారంభించారు. అధికారంలో కాంగ్రెస్ ఉండటం, స్థానిక ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ కావడంతో ప్రతి కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోటాపోటీ నెలకొంది. ఈ విషయమై సీఈఓతో మాట్లాడగా ఉదయం 9.30 నిలకు ప్రారంభం ఉన్నట్లు ఎమ్మెల్యేకి సమాచారమిచ్చామని, ఆయన రాక ఆలస్యమవడంతో మరో కార్యక్రమంలో పాల్గొనేది ఉందని పీఏసీఎస్ చైర్మన్, కొందరు డైరెక్టర్లు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి వెళ్లిపోయారు. తర్వాత కొద్ది సమయానికి వచ్చిన ఎమ్మెల్యే తిరిగి కేంద్రాన్ని ప్రారంభించారు.

ఆ ఆరోపణల్లో వాస్తవం లేదు

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవంలేదని, వారిపై పరువునష్టం దావా వేస్తానని సిద్దిపేట ఆత్మ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సత్యనారాయణ రెడ్డి అన్నారు. గ్రామస్తులతో కలిసి శనివారం ఆయన మాట్లాడారు. మేడిపల్లిలో 1962లో భూకమతాల ఏకీకరణలో భాగంగా పట్టా భూములకు బదులు ప్రభుత్వ భూములు ఇచ్చామని, 10.03 గుంటల పట్టాభూమిని ప్రభుత్వం తీసుకుని ఎస్సీ కాలనీకి, వారికి మామడి చెట్ల పెంపకానికి అందజేసిందని చెప్పారు. 1963లో తనకు ప్రభుత్వం వేరేచోట 7.39 గుంటల భూమి అందజేసి పట్టాలు కూడా ఇచ్చిందని తెలిపారు. అప్పటి నుంచి కబ్జాలో ఉన్నామని, ధరణి వచ్చాక ప్రభుత్వ భూమిగా వస్తే కలెక్టర్‌కు, కమిషనర్‌కు ఎన్‌ఓసీకి ఫిర్యాదు చేయగా తన పేరుపై వచ్చిందని వివరించారు. తప్పుడు ఆరోపణలు చేస్తున్నవారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

'ప్రజాపాలన'కు మొండిచేయి

గజ్వేల్/బెజ్జంకి(సిద్దిపేట): రేషన్‌కార్డుల కోసం ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుల్లో 30శాతం మాత్రమే ఆమోదించారని, మిగిలిన దరఖాస్తుదారులకు మొండిచేయి చూపారని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ రేషన్‌కార్డులివ్వాలని, లేకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రజాపాలనలో దరఖాస్తులనే ప్రాతిపదికగా తీసుకొని రేషన్‌కార్డులివ్వాలని సీపీఐ జిల్లా నేత, మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కులగణన సర్వేను పరిగణలోకి తీసుకొంటే పేదలకు అన్యాయం జరుగుతుందని వాపోయారు.

'స్థానిక' ఎన్నికల్లో గులాబీజెండా ఎగరాలి

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా అత్యధిక స్థానాలు సాధించేందుకు ప్రతి కార్యకర్త కృషిచేయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని తాజ్‌గార్డెన్‌లో శనివారం బీఆర్ఎస్ పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను విస్మరించిందన్నారు. 13 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటాలు తప్ప చేసిన అభివృద్ధేమీ లేదని ఎద్దేవా చేశారు. ప్రతి కార్యకర్త గ్రామాల్లో తిరిగి కాంగ్రెస్ మోసాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. హామీలు అమలుచేయడం చేతకాక బీఆర్ఎస్ నాయకులపై అక్రమకేసులు పెడుతున్నారని ఆరోపించారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని, ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధికి కృషిచేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు సంతోష్‌కుమార్, యాదగిరి, మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుమలత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతూన్న ఎమ్మెల్యే పల్లా

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

పోలీసు అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): గజ్వేల్‌రూరల్/సిద్దిపేటజోన్: సైబర్ నేరాలు, షీ టీమ్, వివిధ చట్టాల గురించి విద్యార్థులకు శనివారం పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అందులో అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, మహిళల రక్షణ నూతన చట్టాలపై విద్యార్థులకు షీటీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, షీటీం సభ్యులు సదయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా గజ్వేల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు, సిద్దిపేటలోని మాస్టర్ మైండ్స్ జూనియర్ కళాశాలలో షీ టీం అధికారులు కిషన్, ప్రవీణ్ విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, షీటీమ్ కానిస్టేబుల్ మహేశ్, భరోసా సెంటర్ సిబ్బంది వినోద, సోని, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ భూముల పరిశీలన

హుస్నాబాద్‌రూరల్: రైతుభరోసా పథకంలో భాగంగా అధికారులు సాగుకు యోగ్యంకాని భూములను సర్వే చేస్తున్నారు. శనివారం పట్టణ శివారు తోట పల్లి, గాంధీనగర్, పందిల్ల, పోతారం(ఎస్) గ్రామాల్లో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి మండల సర్వేయర్, వ్యవసాయ అధికారుల సహకారంతో రియల్ ఎస్టేట్ వెంచర్ల భూములను పరిశీలించారు. వారి వెంట ఏఓ నాగరాజు, తహసీల్దార్ రుక్మిణిరెడ్డి ఉన్నారు.

◆ ఫ్లెక్సీల ఏర్పాటుపై ఆగ్రహం

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాలలో కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు భక్తులకు ఇబ్బంది కలిగించే విధంగా ఉన్నాయని బీఆర్ఎస్, సీపీఎం నాయకులు శనివారం వేరువేరుగా ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తొలగించాలని డిమాండ్‌చేశారు. కిషన్, స్వామి గౌడ్, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

కొండపాక(గజ్వేల్): సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం లాంటిదని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుమార్ అన్నారు. మండల పరిధిలోని దుద్దెడలో శామంతుల పోశవ్వ పేరిట మంజూరైన రూ.51,500, సబవరాజు సత్తవ్వ పేరిట రూ.14వేలు చెక్కులను శనివారం అందజేశారు.

◆ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం

దుబ్బాకటౌన్: ఎస్సీ వర్గీకరణతోనే ఉపకులాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఇస్తారిగల్ల స్వామి అన్నారు. శనివారం దుబ్బాకలో కళాబృందంతో ప్రదర్శన నిర్వహించి ర్యాలీ చేశారు. రాజమల్లు, చెక్కపల్లి పద్మయ్య, రమేశ్, ఎల్లం, రాంచంద్రం పాల్గొన్నారు.

◆ ఉత్సవ విగ్రహాల బహూకరణ

హుస్నాబాద్‌రూరల్: పొట్లపల్లిలో మల్లికార్జున స్వామి ఉత్సవాలు ముగియడంతో శనివారం ఆదాయ, వ్యయాలపై ప్రత్యేక అధికారి ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి సమక్షంలో చర్చించారు. ఉత్సవాల కోసం రూ.64వేలు ఖర్చుచేయగా రూ.40వేలు దాతలు విరాళాలు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. మాజీ సర్పంచ్ గుర్తూరి రాజవ్వ, కానుగుల మోహన్‌స్వామివారికి 23కిలోల వెండి విగ్రహాలను బహూకరించినట్లు చెప్పారు.

◆ ఇన్‌చార్జి అధ్యక్షుడిగా శ్రీనివాస్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా నాయీబ్రాహ్మణ సంఘం ఇన్‌చార్జి అధ్యక్షుడిగా సింగరాల శ్రీనివాస్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు కొత్వాల్ యాద నరేందర్ శనివారం తెలిపారు. విద్యాకర్, కనకయ్య, సతీశ్, స్వామి పాల్గొన్నారు.

◆ పోలీస్‌స్టేషన్ పరిధి మార్చాలంటూ వినతి

చేర్యాల(సిద్దిపేట): కమలాయపల్లి గ్రామాన్ని మద్దూరు స్టేషన్ పరిధి నుంచి చేర్యాల పరిధిలో చేర్చాలని కోరుతూ శనివారం నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. స్పందించిన ఆయన సీపీకి లేఖ రాశారు. శంకరాచారి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్థానిక రాఘవేంద్రనగర్ 11కేవీ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్‌ల కింద చెట్లకొమ్మల తొలగింపు, అలాగే అర్బన్ మండల పరిధిలోని ఎన్సాన్‌పల్లి 33/11కేవీ, 33కేవీ మిట్టపల్లి సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎఫ్‌సీఐ గోదాం, సీతారాం నగర్, ఇందిరానగర్, వడ్డెర కాలనీ, రాఘవేంద్రనగర్, లలితానగర్, కాళ్లకుంట కాలనీలలో ఉదయం 9.30 నుంచి నుంచి మధ్యాహ్నం 12.30వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ఎన్సాన్‌పల్లి, ఎన్సాన్‌పల్లి ఇండస్ట్రియల్ ఏరియా, మిట్టపల్లి, మందపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని, రంగథాంపల్లిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

నియామక పత్రాలు అందజేసిన పొన్నం



నియామకపత్రం అందుకుంటున్న జీవన్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): డీసీసీ లీగల్ సెల్ నూతన కార్యవర్గానికి మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం హుస్నాబాద్‌లో నియామక పత్రాలను అందజేశారని ఆ సెల్ చైర్మన్ జీవన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైర్మన్ పొన్నం అశోక్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారని చెప్పారు. వైస్ చైర్మన్‌లుగా జనార్దన్‌రెడ్డి, చిత్తరి రవీందర్, ప్రధాన కర్యదర్శులుగా బైరి ప్రవీణ్‌కుమార్, సంతోష్, రామకృష్ణ, సూర్యకళ, కార్యదర్శులుగా కనకయ్య, మహేశ్ ఎంపికైనట్టు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆత్మారాములు, శ్రీనివాస్, రమేశ్, గౌస్, కరీం, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం

ట్రాఫిక్ ఏసీపీ సుమన్

సిద్దిపేటజోన్: ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను నివారిద్దామని ఏసీపీ సుమన్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్ వద్ద నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరి నిబంధనలు పాటించాలన్నారు. తప్పనిసరి హెల్మెట్ ధరించాలని, రాంగ్ డ్రైవింగ్ నేరమని హెచ్చరించారు. అనంతరం టీటీడీ కల్యాణ మండపం వద్ద కార్ల డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ అధికారులు ఉమేశ్, సదాశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గౌరారంలో..

వర్గల్(గజ్వేల్): మండలంలోని గౌరారంలో ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి యువకులు, వాహనదారులకు అవగాహన కల్పించారు. నిబంధనలు విస్మరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థినికి సైకిల్ అందజేత



విద్యార్థినికి సైకిల్‌ను అందజేస్తున్న హెచ్‌ఎం

కొండపాక(గజ్వేల్): కాలినడకన పాఠశాలకు వస్తూ ఇబ్బందులు పడుతున్న విద్యార్థిని వేమిరెడ్డి మహితకు ఉపాధ్యాయుడు వంగ నర్సారెడ్డి శనివారం సైకిల్‌ను అందజేశారు. చేర్యాల మండలంలోని దానంపల్లి శివారులోని ఓ కోళ్లఫాంలో మహిత తల్లిదండ్రులు పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. మహితతో పాటు ఆమె తమ్ముడు, చెల్లెలు సుమారు నాలుగు కిలోమీటర్ల నడుచుకొంటూ బందారం హైస్కూల్‌కు వస్తుంటారు. దీంతో ఉపాధ్యాయుడు నర్సారెడ్డి సొంత ఖర్చులతో సైకిల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రాంచంద్రం మాట్లాడుతూ మిగతా ఇద్దరు విద్యార్థులకు సైతం సైకిళ్లు అందజేసేలా కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయుడికి మహితతో పాటు ఇతర ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

కిడ్నీ వ్యాధి బాధితుడికి ఎల్‌ఓసీ

మర్కూక్(గజ్వేల్): కిడ్నీకి సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న పాములపర్తికి చెందిన వెంకటయ్యకు బీఆర్ఎస్ నేతలు శనివారం ఎల్‌ఓసీ అందజేశారు. మాజీ ఎంపీపీ పాండుగౌడ్ ఎల్‌ఓసీ కోసం దరఖాస్తు చేయగా బాధితుడికి మెరుగైన వైద్యం కోసం రూ.2.25లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. మాజీ జెడ్పీటీసీ రాంచంద్రం యాదవ్, బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్యతో కలిసి పాండుగౌడ్ ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కిష్టగౌడ్, నరేందర్ రెడ్డి, కరుణాకర్, శ్రీనివాస్, రాములు, సుధాకర్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.